సాక్షి నిర్మల్
మంగళవారం ; 31 ; జనవరి ; 2023



బ్రహ్మోత్సవాలకు వేళాయె

కడెం మండలంలో గోదావరి తీరాన.. కొండ గుహలో వెలసిన అక్కకొండ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీ వరకు జరగనున్నాయి. 8లో▸



మహాత్ముడికి నివాళి

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ ఆశయలను, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన అనుసరించిన మార్గాలను గుర్తుచేసుకున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.1 / 19.5

ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. వాతావరణం పొడిగానే ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ముషరఫ్ అలీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముషరఫ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముషరఫ్ అలీ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, హేమంత్ బొర్కడేతో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాందేడ్ సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మైనంపల్లి

భైంసా: మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కోరారు. సోమవారం నాందేడ్ వెళ్తున్న ఆయన బాసర మండలం బిద్రెల్లిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మమ్మాయి రమేశ్ ఉన్నారు.

అమరవీరులకు రుణపడి ఉండాలి



మౌనం పాటిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది

నిర్మల్‌టౌన్: దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన అమర వీరులకు రుణపడి ఉండాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం గాంధీ వర్ధంతి సందర్భంగా ఎస్పీ క్యాంపు, పోలీస్ కార్యాలయంలో అమరవీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... దేశ ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్ర్యం కల్పించడమే లక్ష్యంగా వేలాది మంది పోరాటంలో పాలుపంచుకుని తమ ప్రాణాలను సైతం అర్పించారని వివరించారు. వారి త్యాగ ఫలితంగానే మనమంతా ఆ ఫలాలను అనుభవిస్తున్నామని గుర్తు చేశారు. అలాంటి త్యాగ వీరులను స్మరించుకోవడం దేశ పౌరులుగా మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఏవో వెంకటశేఖర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్, రామకృష్ణ, ఆర్ఎస్ఐ సాయికుమార్, సూపరింటెండెంట్లు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కుట్టు మిషన్ అందిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్‌టౌన్: మహిళలు ఎవరిపైనా ఆధారపడకుండా ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో ఉష ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహకారంతో సర్వోదయ శ్రీనివాస్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే 9 రోజుల ఉచిత టైలరింగ్ శిక్షణను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉష లిమిటెడ్ వారు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఇంటి వద్దే ఉపాధి కల్పిస్తున్నారన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో శిక్షణ పొందుతున్న మహిళలు వారితో పాటు, మరో నలుగురికి ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్, బుక్స్ ఉష లిమిటెడ్ వారు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉష లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ రాజ్‌కుమార్, శ్రీనివాస్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, వశిష్ట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అఖిలేశ్, టైలరింగ్ శిక్షణకు వచ్చిన 15 మంది మహిళలు పాల్గొన్నారు.



మున్సిపల్‌లో ముసలం!

నిర్మల్: అమ్మకానికి నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులు, మాస్టర్‌ప్లాన్ ముసాయిదాలో అవకతవకలు, జిల్లాకేంద్రంలో ఇష్టారీతిన ఆక్రమణలు.. ఇలా ఇప్పటికే ఎన్నో వివాదాలు ముసురుకున్న నిర్మల్ మున్సిపల్‌లో మరో ముసలం పుట్టుకొచ్చింది. ఈసారి బల్దియా రాజకీయంగా రచ్చకెక్కుతోంది. ఏకంగా చైర్మన్ పీఠంపైనే కౌన్సిలర్లు తిరుగుబాటు చేయబోతున్నారు. గండ్రత్ ఈశ్వర్ నియంతగా వ్యవహరిస్తున్నాడంటూ మెజార్టీ కౌన్సిలర్లు సోమవారం రహస్యంగా సమావేశం కావడం జిల్లాకేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. పలు సమావేశాల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఎదుటే ఈశ్వర్‌పై పలువురు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తంచేశారు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లపై అవిశ్వాసాల టైం నడుస్తుండగా నిర్మల్‌లో చైర్మన్‌కు వ్యతిరేకంగా కౌన్సిలర్లు భేటీకావడం గమనార్హం. ఈ విషయం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. ఆయన కూడా కొంతకాలంగా చైర్మన్‌పై అసంతృప్తితో ఉన్నట్లు బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు.

- చైర్మన్‌కు వ్యతిరేకంగా గళమెత్తిన కౌన్సిలర్లు
- నేడో రేపో గోవాకు వ్యతిరేకవర్గం!
- మంత్రి దృష్టికి పంచాయితీ

అసంతృప్తి గళం..

నిర్మల్ మున్సిపాలిటీలో చైర్మన్ ఈశ్వర్‌కు, అధికార పార్టీకే చెందిన పలువురు కౌన్సిలర్లకు కొంతకాలంగా దూరం పెరుగుతూ వస్తోంది. ఇటీవల వరుస ఘటనలు, వాటి పరిణామాలతో మరింతగా ముదురుతోంది. తమ వార్డుల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, సమస్యలనూ పెద్దగా పట్టించుకోవడం లేదని, కొందరికే ప్రాధాన్యతనిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకరిద్దరు కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లనే ప్రోత్సహిస్తున్నారని, మిగతావాళ్లకు మొండిచేయి చూపుతున్నారని బాహాటంగానే చైర్మన్‌పై ఆరోపణలు చేస్తున్నారు. మంత్రి పేరు చెప్పి తమను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడుతున్నారు.

గతంలో మంత్రి ఎదుటే..

ఒకట్రెండు సందర్భాల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఎదుటే కౌన్సిలర్లు చైర్మన్‌పై తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. గాంధీ మార్కెట్‌యార్డులో నిర్వహించిన సమావేశం, మున్సిపల్ సమావేశాల్లోనూ పలువురు కౌన్సిలర్లు చైర్మన్‌పై ఆరోపణలు చేశారు. తమకు చెప్పకుండా తమ వార్డుల్లో కార్యక్రమాలు నిర్వహించడంపై నిలదీశారు. తమకు సమాచారం ఇవ్వకుండా తమ ఏరియాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. తనతో బంధుత్వం ఉన్న, దగ్గరగా ఉన్న ఒకరిద్దరు కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లను మాత్రమే ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. చిన్నచిన్న పనులు కూడా తమకు ఇవ్వకుండా తనకు బినామీగా ఉండేవారికి ఇస్తున్నారని తెలిపారు.

వ్యతిరేక వర్గంగా..

నిర్మల్ మున్సిపాలిటీలో ముందు నుంచీ ఒకట్రెండు వర్గాలుగా కౌన్సిలర్లు కొనసాగుతున్నారు. అందరూ అధికార పార్టీకి చెందినవారే అయినా లీడర్లవారీగా ఉన్నారు. ప్రధానంగా మున్సిపల్ నిధులు, పనులు, కమీషన్ల విషయంలోనే కౌన్సిలర్లు, చైర్మన్‌కు మధ్య విభేదాలు పెరిగాయి. పట్టణంలో మున్సిపల్ పనులు మొత్తం ఒకరిద్దరి చేతుల్లోనే కేంద్రీకృతం కావడం, కనీసం కమీషన్లు, గుర్తింపు లేకపోవడం క్రమంగా కౌన్సిలర్లలో అసంతృప్తిని పెంచింది. ఆరోపణలకు తగ్గట్లు ఇటీవల 44 పోస్టుల లొల్లి, మాస్టర్‌ప్లాన్ ముసాయిదాపై రచ్చ మున్సిపల్‌ను చుట్టుముట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం మున్సిపాలిటీల్లో అవిశ్వాసాల పర్వం నడుస్తోంది. ఇదే అదనుగా మెజార్టీ కౌన్సిలర్లు సోమవారం భేటీ అయినట్లు సమాచారం. తమ అసంతృప్తి గళాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినిపించగా, నిర్మల్ రాగానే దీనిపై మాట్లాడుతానని ఆయన పేర్కొన్నట్లు తెలిసింది. అసంతృప్త కౌన్సిలర్లు నేడోరేపో గోవాకు మకాం మార్చనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రి స్పందించే తీరుపైనే చైర్మన్ భవిష్యత్ ఆధారపడి ఉంటుందని సీనియర్ కౌన్సిలర్లు అభిప్రాయపడుతున్నారు.

అందరం కలిసే ఉన్నాం..: గండ్రత్ ఈశ్వర్

నిర్మల్ మున్సిపాలిటీలో కౌన్సిలర్లందరం కలిసే ఉన్నామని, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాల మేరకు నడుచుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ తెలిపారు. కౌన్సిలర్ల రహస్య సమావేశం నేపథ్యంలో ఆయన తన అనుకూల కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నట్లు నిర్మల్ మున్సిపాలిటీలో అవిశ్వాసం లేదని, ఇక్కడ అందరం కలిసే నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంత్రి నిర్ణయం ప్రకారమే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. సమావేశానికి చైర్మన్ వ్యతిరేకవర్గం కౌన్సిలర్లు హాజరు కాలేదు.



తన మద్దతుదారులతో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

ఇదేం 'ప్లాన్'..!

- 'ముసాయిదా' నిలిపేశామంటూ కమిషనర్ ప్రకటన
- మభ్యపెట్టడానికే.. అంటున్న ప్రతిపక్షాలు
- నేడు కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా
- మంత్రిని మళ్లీ కలువనున్న రైతు జేఏసీ

నిర్మల్: నిర్మల్ మాస్టర్ ప్లాన్‌లో మిస్టరీ కొనసాగుతూనే ఉంది. ఇటీవల మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ విరుద్ధ ప్రకటనలు చేశారు. తాజాగా మున్సిపల్ కమిషనర్ సంపత్ మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ నిలిపివేశామని ప్రకటించారు. అన్నివర్గాలతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిపై ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ మండిపడుతున్నాయి. ప్రజలు ఎన్నుకున్న కౌన్సిల్, ప్రభుత్వం ఉండగా మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను కమిషనర్ ఎలా రద్దు చేస్తారని ప్రశ్నిస్తున్నాయి. ప్రజలను, రైతులను మభ్యపెట్టడానికే అధికార పార్టీ కొత్త ఎత్తుగడ వేసిందని ఆరోపిస్తున్నాయి. మరోవైపు బృహత్ ప్రణాళిక డ్రాఫ్టులో సవరణలు వద్దు.. ముసాయిదా రద్దు చేయాలంటూ రైతు ఐక్యకార్యాచరణ కమిటీ డిమాండ్ చేస్తోంది. ఈమేరకు మరోసారి మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలుస్తామంటోంది. ఇక బీజేపీ ముందుగా ప్రకటించినట్లు మంగళవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు సిద్ధమవుతోంది. రైతులు, అమాయకుల భూములకు ఎసరు పెట్టేలా ఉన్న సవరణలను, ఇలా ప్రకటనలు, నోటిమాటల ద్వారా కాకుండా, శాస్త్రీయంగా రద్దు చేసేవరకు తమ ఆందోళన కొనసాగిస్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.

అయోమయం.. గందరగోళం..

నిర్మల్ మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ ముసాయిదా లొల్లి రోజుకో మలుపుతిరుగుతోంది. తనను కలిసిన రైతులతో మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేశామని మంత్రి చెప్పగా, అదేరోజు రద్దు చేయడం ఉండదని, సవరణలపై అభ్యంతరాలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ స్పష్టంచేశారు. ఇలా విరుద్ధమైన ప్రకటనలతో ప్రజల్లో అయోమయం నెలకొంది. ఇదిలా ఉండగానే తాజాగా డ్రాఫ్టును నిలిపివేస్తున్నామని, అన్నివర్గాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటా మని కమిషనర్ ప్రకటించడం గమనార్హం. ఒకదా నికొకటి పొంతన లేకుండా ఎవరికి వారు ప్రకటనలు చేయడంపై పట్టణవాసులు విస్తుపోతున్నారు.

ఆందోళన యథాతథం..

'అసలు మున్సిపల్ కమిషనర్‌కు మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేసే అధికారం ఉందా.. ఉంటే కామారెడ్డి, జగిత్యాలలో వారే చేసేవారు కదా.. అక్కడ పనిచేయని అధికారం ఇక్కడే ఎలా చేసింది..?' అంటూ ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి పంపితే, ప్రభుత్వం ఆమోదిస్తేనే మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ రద్దవుతుందని చెబుతున్నారు. రైతులు, విపక్షాలు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలోనే ఇలాంటి మభ్యపెట్టే ప్రకటనలు చేస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. తమ పార్టీ ముందుగా నిర్ణయించినట్లు మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట ధర్నాను కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

కుష్ఠుపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ హైస్కూల్‌లో నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి వంశ పారంపర్యం కాదని, ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే నయమవుతుందని తెలిపారు. మైకో బ్యాక్టీరియా లెప్రి అనే బ్యాక్టీరియా వలన వ్యాధి వస్తుందని, ముఖ్యంగా ఇది చర్మానికి, నరాలకు సోకుతుందని వివరించారు. ఈ వ్యాధి బహుళ ఔషధ చికిత్సలో ఆరు నెలల నుంచి 12 నెలల్లో పూర్తిగా నయమవుతుందని పేర్కొన్నారు. ప్రారంభ దశలోనే గుర్తించి ఎండీటీ చికిత్స అందిస్తే అంగవైకల్యానికి దారితీయదని తెలిపారు. అంతకుముందు విద్యార్థులు, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు కుష్ఠు నివారణకు తమ వంతు చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్, వినోద్‌కుమార్, గంగన్న, కిషన్‌రావు, ఎల్లేశ్, రాజశేఖర్, నరేందర్, నర్సారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు పద్మ పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లించాలి

నిర్మల్ రూరల్: ఓపెన్ టెన్త్, ఇంటర్ చదివే విద్యార్థులు గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ.25 ఆలస్య రుసుముతో ఫిబ్రవరి 11 నుంచి 26 వరకు, రూ.50 ఆలస్య రుసుముతో ఫిబ్రవరి 17 నుంచి 22 వరకు చెల్లించవచ్చని వివరించారు. ఫీజును టీఎస్ ఆన్‌లైన్ లేదా మీసేవ వెబ్‌సైట్‌లో చెల్లించాలని తెలిపారు. చాలన్, డీడీలు చెల్లుబాటు కావని పేర్కొన్నారు.

త్వరలో అర్హులకు 'పోడు' పట్టాలు

- మంత్రి సత్యవతి రాథోడ్
- ఫిబ్రవరి 1న 'మన ఊరు మనబడి' పాఠశాలల ప్రారంభం
- పారదర్శకంగా టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: అర్హులైన పోడు రైతులకు ఫిబ్రవరిలో పట్టాలు పంపిణీ చేస్తామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పోడు భూముల సమస్య పరిష్కారానికి సీఎం కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో వంద శాతం సర్వే, గ్రామ సభలు పూర్తి చేసామన్నారు. ఫిబ్రవరిలో పట్టాల పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు సూచించారు. అడవులను సంరక్షిస్తూనే, చట్టాలకు లోబడి సాగు చేస్తున్న గిరిజన, గిరిజనేతర రైతులకు పోడు పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.

సబ్ కమిటీ ఏర్పాటు చేసి..

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ సబ్ కమిటీ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున చర్చ జరిపి పోడు సమస్యను కొలిక్కి తెచ్చామని తెలిపారు. పోడు భూముల పట్టాల పంపిణీ అనంతరం మరో ఇంచు భూమి కూడా ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ప్రజాప్రతినిధులు, అన్ని పక్షాల ప్రతినిధులతో గ్రామాల్లో అటవీ సంరక్షణకు కట్టుబడి ఉండేలా తీర్మానం చేయాలన్నారు. గ్రామ సభల తీర్మానాలు, ఎస్‌డీఎల్‌సీ మధ్య ఉన్న గ్యాప్‌పై కలెక్టర్లు సమీక్షించాలని తెలిపారు. పోడు పట్టాల కోసం వచ్చిన దరఖాస్తు తిరస్కరించే పక్షంలో దానికి కారణాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు

గ్రీవెన్స్ విభాగం ఏర్పాటు చేయాలి...

టీచర్ల బదిలీలు పదోన్నతుల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతికుమారి సూచించారు. ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదు స్వీకరణకు గ్రీవెన్స్ విభాగం ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా మెడికల్ బోర్డు, సదరం క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. మన ఊరు మన బడి కింద పూర్తి చేసిన పాఠశాలలను ఫిబ్రవరి 1న పండుగ వాతావరణంలో ప్రారంభించాలని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు హేమంత్ బోర్కడే, రాంబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మొదట బదిలీలు.. తర్వాత పదోన్నతులు

- ఉపాధ్యాయుల ఖాళీలు, సీనియార్టీ జాబితా విడుదల
- కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ
- గడువు రెండు రోజులు పొడిగింపు
- ఇప్పటి వరకు 1,482 దరఖాస్తులు

ఉపాధ్యాయుల వివరాలు..

మొత్తం పోస్టులు	2,844
పనిచేస్తున్న వారు	2,370
8 ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్నవారు	647
పీజీహెచ్ఎం ఖాళీలు	59
స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు	169



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయుల బదిలీలు.. పదోన్నతులకు రంగం సిద్ధమైంది. బదిలీల్లో కీలకమైన సీనియార్టీ జాబితా తయారుచేసి జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యంతరాలను స్వీకరించారు. ఇప్పటికే డీఈవో కార్యాలయంలో పీజీహెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్ల కోసం సంబంధించి ధ్రువపత్రాలను, సర్వీస్ పుస్తకాలను పరిశీలించారు. మరోవైపు బదిలీల కోసం దరఖాస్తు స్వీకరణ గడువును ప్రభుత్వం ఫిబ్రవరి 1 వరకు పొడిగించింది. సోమవారం వరకు 1,482 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. మొదట బదిలీలు, ఆ తర్వాత పదోన్నతులు చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బదిలీలు ఆన్‌లైన్‌లో, పదోన్నతులు ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు.

ప్రక్రియ ఇలా..

మొదట గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలు నిర్వహిస్తారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పిస్తారు. ఇప్పటికే ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఖాళీలతోపాటు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్లకు బదిలీ అవకాశం ఇస్తారు. తర్వాత అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తారు. ఇదివరకు ఉన్న ఎస్జీటీ ఖాళీలతో సహా ఎస్జీటీల నుంచి ఎస్ఏలుగా పదోన్నతి పొందిన ఖాళీలను కలుపుకుని బదిలీలు చేస్తారు.

వీరు కదలాల్సిందే ...

ఒకే బడిలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు జిల్లాలో 647 మంది ఉన్నారు. పీజీహెచ్ఎంలకు మొదట ఎనిమిదేళ్ల లాంగ్ స్టాండింగ్ ప్రతిపాదన తీసుకురాగా తర్వాత ఉపాధ్యాయవర్గాల ఒత్తిడితో దానిని ఐదేళ్లకు కుదించింది. అంటే ఐదేళ్లు సర్వీస్ నిండిన పీజీహెచ్ఎంలు, 8 ఏళ్ల సర్వీస్ నిండిన ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు స్థానచలనం తప్పదు. ఇక జీవో 317 ద్వారా బదిలీపై వచ్చిన వారికి తాజా బదిలీల్లో అవకాశం కల్పించడం లేదు. బదిలీల్లో జీరో సర్వీస్ నిబంధన ఎత్తివేయడంతో వీరికి అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

జిల్లాలో పీజీహెచ్ఎం పోస్టులు మొత్తం 107 ఉండగా, ఇందులో 59 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు 79 ఉండగా, 46 ఖాళీగా ఉన్నాయి. వీటిని సీనియార్టీ ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలతో భర్తీ చేస్తారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 169 ఖాళీగా ఉన్నాయి. ఒకే పాఠశాలలో మూడేళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు బదిలీ కోసం దరఖాస్తు పెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 14న పీజీహెచ్ఎంలకు బదిలీ ఉత్తర్వులు ఇస్తారు. 16 నుంచి 18 వరకు స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పిస్తారు. 22, 23 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు ఉంటాయి. 25 నుంచి 27వ తేదీ వరకు ఎస్జీటీలకు బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారు. మార్చి 5 నుంచి 19 వరకు అభ్యంతరాలకు అవకాశం ఇస్తారు.

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందించడమే లక్ష్యమని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నా పోలీసులకు నేరుగా లేదా వాట్సాప్ నంబర్ 87126 59599కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలి



ప్రైవేట్ యజమానులతో మాట్లాడుతున్న ఆర్ఎం

నిర్మల్‌టౌన్: ఆర్టీసీలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజినల్ మేనేజర్ కె.జానీరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి నిర్మల్ డిపోను తనిఖీ చేశారు. బస్సుల నిర్వాహణ, ఆదాయం రూట్లు, ప్రయాణికుల రద్దీ ఉండే రూట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రైవేట్ బస్సుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ అధికారులతో కలిసి పనిచేయాలని సూచించారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేలా చూడాలని డ్రైవర్లకు సూచించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.సాయన్న, సహాయ మేనేజర్లు ఐ.రాజశేఖర్, శ్రీకర్, ప్రైవేటు బస్సుల యజమానులు పాల్గొన్నారు.

నేడు అడెల్లి ఆలయానికి హంపీ పీఠాధిపతి

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధ శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయానికి హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి మంగళవారం రానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అయిటి చందు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు స్వామీజీ ఆలయాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడతారని చెప్పారు. హిందూ బంధువులు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

ఆటోడ్రైవర్‌పై కేసు

ఎదులాపురం: రాంగ్‌రూట్‌లో ఆటో నడిపి కారును ఢీకొన్న ఘటనలో ఆటోడ్రైవర్‌పై టుటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. టుటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ కథనం ప్రకారం.. పట్టణంలోని బ్రహ్మణవాడకు చెందిన సజ్జన్‌పవార్ విజయ్‌కుమార్ హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు తన కారులో వస్తున్నాడు. ఈ క్రమంలో ఠాకూర్ హోటల్ వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్న ఓ ఆటో ఈయన కారును ఢీకొంది. దీంతో కారు కొంత ధ్వంసమైంది. బాధితుడి ఫిర్యాదుతో ఆటోడ్రైవర్ యాకుబ్‌ఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టుటౌన్ ఎస్సై తెలిపారు.

శాస్త్రసాంకేతిక రంగంలో అప్లికేషన్ కీలకం

భైంసా: శాస్త్ర, సాంకేతిక రంగంలో సైన్స్ అప్లికేషన్ పాత్ర కీలకమని ఆర్జీయూకేటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం వర్సిటీలో సైన్స్ అప్లికేషన్ అంశంపై ఒకరోజు సెమినార్ నిర్వహించారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ సెంటర్ ఫర్ స్మోకింగ్ సశేషమ్ అండ్ ట్రైనింగ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా పావని మాట్లాడారు. నానో సైన్స్ ప్రాముఖ్యత వివరించారు. డా దేవరాజు, డా కాశన్న, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డా శోభ, తదితరులు ఉన్నారు.

న్యాయం చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్/నిర్మల్‌చైన్‌గేట్: బదిలీలు, ప్రమోషన్లలో తమకు న్యాయం చేయాలని భాషా పండితులు, పీఈటీలకు కోరారు. ఈమేరకు కలెక్టర్ ముషరఫ్ అలీని సోమవారం కలిసి విన్నవించారు. భాషా పండితులు మాట్లాడుతూ.. పదోన్నతులలో ప్రభుత్వం తమకు మొండి చేయి చూపడం అన్యాయమన్నారు. అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు భాషా పండితులకు తప్పనిసరిగా పదోన్నతులు కల్పించాలని కోరారు. లేకపోతే ఉమ్మడి ఐక్యవేదిక పోరాట కార్యాచరణలో భాగంగా ఫిబ్రవరి 1 నుంచి 9 ,10 తరగతుల బోధనను బహిష్కరిస్తామని హెచ్చరించారు. జాబ్‌చార్ట్ ద్వారా తాము చెప్పాల్సిన 6, 7, 8 తరగతులకు మాత్రమే పాఠాలు బోధిస్తామని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రపంచ తెలుగు మహా సభల్లో ఇచ్చిన హామీ మేరకు వ్యాయామ ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా చాలా సంవత్సరాలుగా ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్నప్పటికీ తమ హోదా ఎస్జీటీ కేడర్‌గానే పరిగణిస్తున్నారని తెలిపారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌రావు, నాయకులు రాజేశ్వర్, భూమన్న, వినోద్, అంజయ్య, పెటా జిల్లా అధ్యక్షుడు భూక్య రమేశ్, ప్రధాన కార్యదర్శి భోజన్న, పీఈటీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భోజన్న, అధ్యక్షుడు రమేశ్, వెంకటరమణారావు, దేవేందర్, అంబాజీ, సంగీత, విమల, జమున, ప్రేమలత, లక్ష్మి, వెన్నెల, వంశీ తదితరులు పాల్గొన్నారు.

దొంగల కోసం గాలింపు

- 12 ప్రత్యేక బృందాలతో తనిఖీలు
- అనుమానితుల విచారణ
- పోలీసులకు సవాలుగా మారిన వరుస చోరీలు
- రాత్రివేళ గ్రామాల్లో గస్తీ



బోథ్ మండలం పొచ్చెరలో గస్తీ తిరుగుతున్న గ్రామస్తులు

ఆదిలాబాద్‌టౌన్: దొంగల ముఠాను పట్టుకునేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. త్రుటిలో తప్పించుకోవడంతో జిల్లా అంతటా జల్లెడ పడుతున్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక బృందాలతో తనిఖీలు కొనసాగుతున్నాయి. అదే విధంగా జిల్లాలో 12 ప్రత్యేక బృందాలతో రాత్రింబవళ్లు పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. వరుస దొంగతనాలు పోలీసులకు సవాలుగా మారాయి. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ప్రవేశించిన దొంగల ముఠా ఎక్కడినుంచి వచ్చింది.. ఎంత మంది ఉన్నారు.. ఎటువైపు వెళ్లారనే విషయంపై ఆరా తీస్తున్నారు. సీసీ కెమెరాల్లో ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పోలీసులు తీవ్ర ప్రయత్నం చేసినప్పటికీ దొంగలు పట్టుబడకపోవడంతో జనాలు కొంత ఆందోళనకు గురవుతున్నారు.

ప్రత్యేక బృందాలతో తనిఖీలు

జైనథ్ మండలంలోని దీపాయిగూడ, ఇచ్చోడ మండల కేంద్రంలో, బోథ్ మండలంలోని పొచ్చెర, ఆదిలాబాద్‌లోని న్యూహౌజింగ్‌బోర్డులో దొంగతనాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నాలుగు చోట్ల కూడా చెడ్డీగ్యాంగ్ పనే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చోడలోని ఓ ఇంట్లోకి చొరబడగా ఆ ఇంటి యజమానులు మెలుకువ ఉండడంతో చోరీకి విఫలయత్నం చేశారు. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసుల నుంచి నలుగురు దొంగలు త్రుటిలో తప్పించుకున్నారు. గత నాలుగు రో జులుగా పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. వారిని పట్టుకునే వరకు వదిలే ప్రసక్తే లేదని చెబుతున్నారు. 12 తనిఖీ బృందాలు ఏర్పా టు చేయగా, ఇందులో సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లు, ఏఆర్ సిబ్బంది ఉన్నారు. వీరితో అన్ని గ్రామాలు, సరిహద్దు ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏ చిన్న సమాచారం వచ్చినా అక్కడికి చేరుకుంటున్నారు.

అనుమానితుల విచారణ

జిల్లాలో అనుమానితులు ఎవరైన కనిపిస్తే పోలీసులు వారిని అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. ఎక్కడినుంచి వచ్చావు.. ఎందుకోసం వచ్చారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆధార్ కార్డు, ఇతర ఐడీ ప్రూఫ్ కార్డులను అడుగుతున్నారు. ఆదివారం రాత్రి జైనథ్ హైవే రోడ్డుపై ఓ ఎర్టిగా కారు నిలబడి ఉండగా, పోలీసులు డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు. ఎవరెవరు వచ్చారని విచారించగా, నలుగురు వ్యక్తులను మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చానని, వారు బయటకు వెళ్లివస్తామని, వచ్చేవరకు ఇక్కడే ఉండాలని సూచించడంతో ఉన్నట్లు తెలిపాడు. అయితే ఆ వాహనంలో ప్రయాణించిన నలుగురు ఇంతవరకు వాహనం వద్దకు రాలేదని సమాచారం. అయితే ఆ డ్రైవర్ వదిలేశారా.. లేదా అనే విషయాన్ని జైనథ్ పోలీసులు స్పష్టం చేయడం లేదు. అదేవిధంగా బజార్‌హత్నూర్ మండలం డెడ్రాలో మరో అనుమానితుడిని అదుపులో తీసుకున్నారు. విచారణ అనంతరం ఆ వ్యక్తిని వదిలిపెట్టినట్లు పోలీసులు చెబుతున్నారు.

గ్రామాల్లో గస్తీ

దొంగల భయం జిల్లాలో గుబులురేపుతోంది. ఏ ఊరికెళ్లినా దొంగలు వస్తున్నారటా.. మీ ఊరికి వచ్చారా అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. వరుస దొంగతనాలు జరగడంతో గ్రామాల్లో పోలీసులతో కలిసి రాత్రి సమయంలో గ్రామస్తులు గస్తీ తిరుగుతున్నారు. అదేవిధంగా గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో దొంగల భయం ఎక్కువగా ఉంది. అయితే జనాలు భయపడాల్సిన అవసరం లేదని, అనుమానితులు కనిపిస్తే డయల్ 100, పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెబుతున్నారు.


12 టీమ్‌లతో తనిఖీలు



జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాల్లో 12 ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతున్నాం. దొంగల ఆచూకీ కనుగొంటాం. ప్రస్తుతం దొంగల ముఠా పట్టుబడలేదు. సరిహద్దు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు చేపడుతున్నాం. ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదు. గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో ఏవైన సంఘటనలు జరిగినప్పుడు తెలిసిపోతుంది.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ, ఆదిలాబాద్

నృసింహుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె



అక్కకొండ లక్ష్మీనరసింహాస్వామి ఆలయం

- రేపటి నుంచి అక్కకొండ బ్రహ్మోత్సవాలు
- ఫిబ్రవరి 2న కల్యాణం, 5న జాతర

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగాపూర్ గ్రామాల సమీపంలో గోదావరి నది తీరాన.. కొండ గుహలో వెలసిన అక్కకొండ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రతిఏటా మాఘశుద్ధ ఏకాదశిలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచేకాక వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బుర్ర రాజారమేశ్ గౌడ్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు నిర్వహించే జాతర(రథోత్సవం) రోజున జాతర నిర్వహించడం ఆనవాయితీ. జాతరలో తినుబండారాలు, అలంకరణ సామగ్రి, ఆట వస్తువులు, దుకాణాలు ఏర్పాటు చేస్తారు.

పురాతన చరిత్ర

అక్కకొండ లక్ష్మీనరసింహాస్వామి పుణ్యక్షేత్రానికి సుమారు ఐదు శతాబ్దాల చరిత్ర ఉంది. ఈ ప్రాంతాన్ని అక్కమ్మ అనే రాణి పరిపాలిస్తుండేది. ఒక రోజు ఆ రాణి కలలో నరసింహాస్వామి రావడంతో గ్రామానికి కొద్ది దూరంలో కొండపై లక్ష్మీ నరసింహాస్వామి ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ ఆలయం అక్కమ్మ కాలంలో స్థాపన జరిగింది. కాలగమనంలో అక్కకొండ లక్ష్మీనరసింహాస్వామి ఆలయంగా పేరు వచ్చినట్లు పూర్వీకులు చెప్పేవారని స్థానికులు పేర్కొన్నారు.



కొండగుహలో వెలసిన లక్ష్మీనరసింహుడు

పూజ కార్యక్రమాలు

1న, అభిషేకం, అర్చన, హారతి ఎలగడప, దిల్దార్‌నగర్ పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, 2న అభిషేకం, మధ్యాహ్నం ఎదురుకోలు గరుడ లగ్నం 'లక్ష్మీనరసింహాస్వామి కల్యాణ మహోత్సవం' 3న, అభిషేకం, అర్చన, చందనోత్సవం, హారతి 4న, అభిషేకం, నిత్యహోమం, బలిహారణములు నివేదన తీర్థప్రసాదాలు, పార్వేట ఉత్సవం(స్వామి వారు వేటకు వెళ్లుట)రాత్రి దోపుసేవ ఉత్సవం 5న అభిషేకం, నిత్యార్చన, హోమ బలిహారణములు, సుదర్శన నారసింహాహోమం. రాత్రి జాతర, తెల్లవారుజాము 4 గంటలకు రథోత్సవం, 6న నిత్యాహోమం, ఏకాంతసేవ, చక్రతీర్థం, నాగవెల్లి, 7న పవిత్రోత్సవం, పండిత సన్మానం, బ్రహ్మోత్సవాల ముగింపు.

ప్రమాద బీమా పథకాలతో భరోసా

- ఎంపీ సోయం బాపూరావు



డ్రైవర్లకు బాండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ సోయం

ఆదిలాబాద్: ప్రమాద బీమా పథకాలతో కుటుంబాలకు భరోసా లభిస్తోందని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ఆధ్వర్యంలో డ్రైవర్లకు పోస్టల్ ప్రమాద బీమా పథకాన్ని ఉచితంగా కల్పించగా ఎంపీ హాజరై బాండ్లు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ కేంద్రం పలు బీమా పథకాలను ప్రవేశ పెడుతూ సామాన్యులకు అండగా నిలుస్తోందన్నారు. అతి తక్కువ ప్రీమియం చెల్లించి బహుళ ప్రయోజనాలు పొందవచ్చని, ఈ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ శాఖ అందజేస్తున్న ప్రమాద బీమా పథకం డ్రైవర్లకు ఎంతో ఉపయోగమని అన్నారు. బీజేపీ రాష్ట నాయకురాలు సుహాసినిరెడ్డి డ్రైవర్లకు ఉచితంగా బీమా సౌకర్యాన్ని కల్పిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఉమ్మడి జిల్లా సూపరింటెండెంట్ కేబీఆర్ ప్రసాద్, బీజేపీ నాయకులు లంక శ్రీను, చాకటి కిరణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న వెడ్మ భొజ్జు పటేల్

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మభొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మభొజ్జు పటేల్ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన భారత్‌జోడో యాత్ర ముగింపులో భాగంగా ఏఐసీసీ పిలుపుతో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 ఏళ్ల ప్రభుత్వాల పాలనలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు మతాల, కులాల మధ్య చిచ్చుపెడుతోందని ఆరోపించారు. ప్రజల్లో సోదరభావాన్ని నెలకొల్పడానికి రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఎమ్మెల్యే రేఖానాయక్ ఆస్తులను కూడగట్టే పనిలో బిజీగా ఉన్నారని అన్నారు. అంతకుముందు మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. పార్టీ కార్యాలయం నుంచి పంచశీలచౌక్, లక్కారం, ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ తీశారు. తర్వాత రామాలయం చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం దర్గా, బిలివర్ చర్చిలో ప్రార్థనలు చేశారు. ఐబీచౌక్ వద్ద బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. నాయకులు లాజర్, రాజేశ్వర్, సలీం, ఇమ్రాన్, దేవానందం, ఖయ్యుం, నిసార్, రాహుల్ జైవంత్‌రావు, అహ్మద్, జంగు, మారుతి, అశోక్, మనోహర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న డీఎస్పీకి సన్మానం

భైంసా: ఆర్జీయూకేటీ బాసర చీఫ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేసిన డీఎస్పీ సురేశ్‌కుమార్ కామారెడ్డికి బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో సోమవారం వర్సిటీలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపిక అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వర్సిటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెక్యూరిటీ అధికారి సీఐ రవీందర్‌నాయక్, వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్పీ కిరణ్‌ఖారెకు..

భైంసాటౌన్: భైంసా ఏఎస్పీ కిరణ్‌ఖారె బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు సోమవారం సన్మానించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఏఎస్పీ చేసిన కృషిని కొనియాడారు. డాక్టర్ దామోదర్‌రెడ్డి, డాక్టర్ ముష్కం రామకృష్ణాగౌడ్, డాక్టర్ అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు మురళీగౌడ్, విలాస్ గాదేవార్, బీజేపీ నాయకులు బాలాజీ సూత్రావే, కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రావు పటేల్, బబ్రు మహారాజ్ పాల్గొన్నారు.



డీఎస్పీ సురేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వర్సిటీ డైరెక్టర్, అధ్యాపకులు



ఏఎస్పీ కిరణ్‌ఖారెను సన్మానిస్తున్న పలువురు ప్రముఖులు

సాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు

కడెం: కడెం ప్రాజెక్ట్ ఫీడింగ్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని ఖానాపూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు రేఖానాయక్, దివాకర్‌రావు అన్నారు. మండలంలోని మాసాయిపేట్ సమీపంలో గల సదర్మాట్ కెనాల్ వద్ద మరమ్మతు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, వీటి పనులు పూర్తి చేసేలా అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడతామని అన్నారు. వారి వెంట ఎస్ఈ సుశీల్‌కుమార్, ఎఎంసీ చైర్మన్ శంకర్, డీఈ భోజదాసు, ఏఈ రవినాయక్, సర్పంచులు రాముగౌడ్, లచ్చన్న తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కమ్యూనిటీ కాంటాక్ట్

- డీఎస్పీ జీవన్‌రెడ్డి
- బోరిగాంలో ఇంటింటా తనిఖీలు
- 60 ద్విచక్రవాహనాల సీజ్



బోరిగాంలో వాహనాలు పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి, పోలీసులు

లక్ష్మణచాంద: శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోరిగాం గ్రామాన్ని సోమవారం ఉదయం 4 గంటలకు డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు చుట్టుముట్టారు. ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను ఠాణాకు తరలించారు. అనంతరం పాఠశాల వద్ద గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పల్లెలు ప్రశాంతంగా ఉండాలనే తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల చెడ్డీగ్యాంగ్ సంచరించిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అపరిచిత, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతీ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. తనిఖీల్లో సోన్ సీఐ రాంనరసింహారెడ్డి, లక్ష్మణచాంద, సోన్, మామడ ఎస్సైలు రాహుల్ గైక్వాడ్, రవీందర్, అశోక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వరుణ్‌రెడ్డి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల నుంచి 52 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను ఆయా విభాగాల అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని ఆదేశించారు. డీడీటీడబ్ల్యూ దిలిప్‌కుమార్, ఏపీవో జనరల్ భీంరావ్, ఏవో రాంబాబు, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

- స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా డైగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటుకు రుణం మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం లింగోజీ తండాకు చెందిన రవికిరణ్ అర్జీ పెట్టుకున్నాడు. – కుటుంబ పోషణ, స్వయం ఉపాధి కోసం వాహనం కొనుగోలుకు రుణం అందించాలని వట్టివాగుకు చెందిన వినోద్‌కుమార్ వేడుకున్నాడు.
- తమ వ్యవసాయ చేనులో బోరుబావితోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించేలా రుణం అందించాలని ఇంద్రవెల్లి మండలం అంజికి చెందిన శశికళ విన్నవించింది.
- తనకు ఆసరా పింఛన్ ఇప్పించాలని ఉట్నూర్ మండలం రాంజీగోండ్‌నగర్‌కు సోయం సుభాష్ అర్జీ పెట్టుకున్నాడు.
- తనకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంద్రవెల్లి మండలం ఈశ్వర్‌నగర్‌కు చెందిన ఆర్.నిరంజన్ విన్నవించాడు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్: గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల విజయ్‌శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలన్నారు. జీవో 317 ద్వారా బదిలీ అయిన స్పౌజ్ కేటగిరి టీచర్లను మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు పంపేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. విద్యాశాఖ పరిధిలో గల 615 మంది టీచర్లను రాష్ట్రంలో బ్లాక్ చేసిన 13 జిల్లాలకు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. టీడబ్ల్యూటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మాడావి లక్ష్మణ్, అసోసియేట్ అధ్యక్షుడు గోవింద్‌రావ్, ప్రధాన కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చుతూ



ఫుడ్‌కోర్టులో భోజనాన్ని ఉంచుతున్న నిర్వాహకుడు



భోజన ప్యాకెట్లు తీసుకుంటున్న యువకుడు

ఆదిలాబాద్‌లోని ఎన్టీఆర్‌చౌక్‌లో హోలి ఫ్యామిలీ క్యాథడ్రల్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టు నిరుపేదల ఆకలిని తీరుస్తోంది. డెవిస్ కార్మెల్ చారిటబుల్ ఆధ్వర్యంలో పేదలకు అండగా నిలిచేలా ఈ కోర్టును ఏర్పాటు చేశారు. అన్నం, పప్పు, కర్రి, ఆచార్‌తో కూడిన ప్యాకెట్లను సిద్ధం చేసి ఇందులో ఉంచుతున్నారు. పట్టణంలోని నిరుపేదలు వాటిని తీసుకుని తమ ఆకలిని తీర్చుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్